క్లుప్తంగా

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయండి..

ఇల్లెందు: భవన నిర్మాణరంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించేందుకు సెప్టెంబర్ 1న ఇల్లెందులో సంఘం జనరల్ బాడీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కె.సారంగపాణి తెలిపారు. గురువారం ఇల్లెందులో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణం కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో రావూరి ఉపేందర్‌రావు, రమేష్, అబ్బయ్య, ప్రభాకర్, లింగయ్య, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు చట్టాలు ఉన్నాయి..

ఇల్లెందు: వృద్ధులకు కూడా ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, తల్లిదండ్రులను కుమారులు, కూతుళ్లు సంరక్షించకపోతే వాటిని ఉపయోగించుకోవచ్చని ఇల్లెందు కోర్టు న్యాయమూర్తి డి.కీర్తిచంద్రికారెడ్డి తెలిపారు. గురువారం ఇల్లెందు పెన్షనర్ భవన్‌లో జరిగిన ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సభలో ఆమె మాట్లాడారు. ఎవరైనా తమ సంరక్షణకు ఇబ్బందిగా ఉంటే కలెక్టర్‌కు అర్జీ పెట్టుకుంటే విచారణ జరిపి చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కీర్తికార్తీక్, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు స్వామిదాసు పాల్గొన్నారు.

వితరణ

పాల్వంచరూరల్: లక్ష్మీదేవిపల్లిలోని శిశు మందిర్ పాఠశాల వర్షానికి కురుస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న కేసా శ్రీనివాస్ సహకారంతో వర్తక సంఘం కన్వీనర్ చలవాది ప్రకాశ్ గురువారం రూ.8వేల విలుగల టార్పాలిన్‌ను వితరణ చేశారు. హెచ్‌ఎం తోట జ్యోతి, ఆర్య వైశ్య మహిళ ఉపాధ్యక్షురాలు చలవాది రాజ్యలక్ష్మి, సాయిలికిత్, సాయి పాల్గొన్నారు.

టీబీఎస్ఎస్ఎస్ యువజన అధ్యక్షుడిగా 'దండిబొట్ల'

కొత్తగూడెంటౌన్: తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (టీబీఎస్ఎస్ఎస్) యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా కొత్తగూడేనికి చెందిన దండిబొట్ల రామాంజన్‌కుమారశర్మ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్నిక అనంగరం నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం చైర్మన్ వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోత్కూరి రామేశ్వరరావు, వైద్య ప్రభాకర్‌శర్మకు కుమారశర్మ కృతజ్ఞతలు తెలిపారు.

ఆత్మగౌరవ సభను విజయవంతం చేయండి..

ఇల్లెందురూరల్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి కోరారు. తహసీల్ వద్ద ఆత్మగౌరవ సభ ప్రచార పోస్టర్లను గురువారం ఉద్యోగులు ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఎస్ ఉద్యోగుల ఆత్మగౌరవ సభను ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సీపీఎస్ ఉద్యోగులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు మధు, కాశయ్య, రవికుమార్, అశోక్‌కుమార్, టి.శ్రీనివాస్, గన్యానాయక్, సంధ్యారాణి, రాజారావ్, పి.కృష్ణ, గంటా ప్రతాప్, బద్రు నాయక్, రాజాలు, ధన్‌సింగ్, అలీ, దర్శన్‌గౌడ్, ఉపేందర్, రాజేశ్వర్, మోహన్‌రావు, లక్ష్మణ్ తదతరులు పాల్గొన్నారు.

యూరియా బ్లాక్ చేస్తే కఠిన చర్యలు

టేకులపల్లి: డీలర్లు యూరియాను బ్లాక్ చేసి అధిక రేట్లకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ గుగులోత్ లాల్‌చంద్, ఏఓ అన్నపూర్ణ హెచ్చరించారు. గురువారం రైతువేదికలో ఎరువులు, విత్తన, పురుగు మందు డీలర్ల సమావేశంలో మాట్లాడారు. యూరియా స్టాక్ రాగానే డీలర్లందరూ వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయాలని పేర్కొన్నారు. అనంతరం కోయగూడెం, టేకులపల్లిలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు.

ఘనంగా బోనాలు



బోనాలతో వస్తున్న స్థానికులు

ఇల్లెందురూరల్: సుదిమళ్ల గ్రామపంచాయతీ జగదాంబగుంపు గ్రామంలో బుధవారం అర్ధరాత్రి బొడ్రాయి ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. గురువారం గ్రామంలోని ప్రతీ కుటుంబం బోనంతో బయలుదేరి నాభిశిల వద్ద ప్రత్యేక పూజ చేసి ముత్యాలమ్మ ఆలయానికి ప్రదర్శనగా చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యంగా బోనం చెల్లించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామాన్ని చల్లంగ చూడాలని, పాడిపంటలు బాగుండేలా దీవించాలని వేడుకున్నారు.

మెరుగైన ఫలితం కోసమే..

- సింగరేణిలో 'మల్టీ డిపార్ట్‌మెంట్ టీమ్' సమావేశాలు
- బొగ్గు ఉత్పత్తి వ్యయం, నష్టాలు తగ్గించడంపై దృష్టి
- భూగర్భగనుల్లో నష్టాల నివారణకు ప్రణాళికలు



కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న కార్మికులు (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తిలో అపారమైన అనుభవాన్ని సొంతం చేసుకుంది. అయితే ఇటీవల కొందరు ఉద్యోగులు గతంలో కంటే భూగర్భ గనుల్లో (సర్ఫేస్ డిపార్ట్‌మెంట్లలో) కష్టపడడానికి ఇష్టపడక కంపెనీ ఇచ్చే సదుపాయాలు మాత్రం పొందుతూ విధి నిర్వహణపై దృష్టి సారించడం లేదని సర్వేలో తేలింది. ఈ నేపథ్యాన ఉద్యోగుల్లో అలసత్వాన్ని పోగొట్టడం, యంత్రాల పనితీరు పెంచడం, భూగర్భగనుల్లో ఉత్పత్తి ఖర్చు తగ్గించడం తదితర అంశాలను సరిచేసేలా యాజమాన్యం సింగరేణి వ్యాప్తంగా మల్టీ డిపార్ట్‌మెంట్ సమావేశాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగానే కొత్తగూడెం ఏరియాలోనూ ఈనెల 12 నుంచి 18వ తేదీ వరకు సమావేశాలు జరిగాయి.

మన గని – మన బాధ్యత..

సింగరేణి సంస్థలో బొగ్గు బయటకు రావాలంటే దాదాపు 56 విభాగాలు పనిచేయాల్సి ఉంటుంది. వీటిలో ఒక్కో శాఖకు ఒక్కో రకమైన బాధ్యత ఉంటుంది. అన్ని శాఖలు సమన్వయంతో.. రక్షణ సూత్రాలను పాటిస్తూ అధికారుల సూచనలు, సలహాలతో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. కానీ 20శాతం ఉద్యోగులే వీటిని పాటిస్తున్నారని కంపెనీ వాదన. ఇందుకు కారణాలు ఏవైనా కంపెనీ కలకాలం కొనసాగాలంటే అందరిలో మార్పు రావడం తప్పనిసరి. బొగ్గు వినియోగం పెరిగినందున నాణ్యమైన బొగ్గును వినియోగదారులకు అందించడం, సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడం, సంస్థ అభివృద్ధికి అవసరమైన కార్మికుల సహకారాన్ని ఈ సమావేశాల్లో వివరిస్తూ వారిలో చైతన్యాన్ని నింపుతున్నారు.

ఐఈడీ శాఖే కీలకం...

కార్పొరేట్ విభాగంలో ఇటీవల ప్రాధాన్యత సంతరించుకున్న శాఖల్లో ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ (ఐఈడీ) ఒకటి. ఈ శాఖ అవసరమయ్యే ఉద్యోగాల నియామకం, వారి అవసరాన్ని గుర్తించి ఏ ఉద్యోగి ఎక్కడ, ఎలా పనిచేయాలో తెలియజేస్తుంది. అలాగే, ఖాళీల భర్తీ అవసరాన్ని రిక్రూట్‌మెంట్ సెల్‌కు సిఫారసు చేస్తుంది. అంతేకాకుండా కంపెనీ ఉత్పత్తి, యంత్రాలు, టెక్నీషియన్ల విధులు, బాధ్యతలు, కంపెనీ లాభనష్టాలు, వాటి నివారణ, యంత్రల పనితీరును పరిశీలించి కార్మికులకు వివరిస్తోంది.

సమస్యలూ తెలుసుకోవాలి...



నష్టాల నివారణకు మల్టీ డిపార్ట్‌మెంట్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇదే సమయాన కార్మికులు గనులతోపాటు శాఖల్లో ఎదుర్కొనే సమస్యలను చెప్పుకునే అవకాశం కల్పించాలి. అలా కాకుండా అధికారులే చెప్పుకుంటూ పోతే లక్ష్యసాధన కష్టం.
– మొగిలిపాక రవి, బీఎంఎస్ ఉపాధ్యక్షుడు

కార్మికులే కారణం కాదు..



భూగర్భగనుల్లో నష్టాలు వస్తున్నందున ఉత్పత్తి ఖర్చు తగ్గించాలని యాజమాన్యం చెబుతోంది. కానీ నష్టం కార్మికుల వల్ల రాదు. ఇది ఉన్నతాధికారులకు కూడా తెలుసు. క్షేత్రస్థాయిలో లోటుపాట్లనే సరిచేయాలి.
– అంతోటి నాగేశ్వరరావు, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ

అంకితభావం పెంచేందుకే...



ఏరియాలో 2,400 మంది ఉద్యోగులకు 50 శాతం మంది కష్టమైన పనులు ఇష్టపడడం లేదు. కొందరు మస్టర్ నమోదుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అందుకే అందరూ అంకితభావంతో పనిచేసేలా ఆలోచన కల్పించేందుకు సమావేశాలు నిర్వహిస్తున్నాం. – శాలేం రాజు, కొత్తగూడెం ఏరియా జీఎం

గిరిజన ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మంత్రి సీతక్కతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కనకయ్య, ఉద్యోగులు, అధికారులు

టేకులపల్లి: సింగరేణిలో పెండింగ్‌లో ఉన్న గిరిజన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీఎం.. సింగరేణి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాలని సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధరావత్ పంతులు, భూక్యా నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య.. మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)ను మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా ఉండాలని సీతక్కను కోరారు. ఈ సందర్భంగా సెంట్రల్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ... అధికారుల ప్రమోషన్లలో క్లస్టర్ మరియు ఇంటర్ క్లస్టర్ ప్రమోషన్లలో తీవ్రంగా అన్యాయం జరుగుతోందని వాపోయారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లైజన్ ఆఫీసర్ వీసం కృష్ణయ్య, వర్కింగ్ ప్రసిడెంట్ గుగులోత్ దశరథ్, వైస్ ప్రెసిడెంట్ తిరుమత్‌రావు, జీఎం సివిల్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అదనపు సదుపాయాలకు అనుమతులివ్వండి..

ఇల్లెందు: ఇల్లెందు మార్కెట్ కమిటీ పరిధిలోని టేకులపల్లి సబ్ యార్డులో కొనుగోళ్లకు అదనపు సదుపాయాలు కల్పించేందుకు అనుమతులు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆశాఖ అదనపు సెక్రెటరీ జి.లక్ష్మిని కోరారు. గురువారం హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవనలోని చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, కొండాయిగూడెం సొసైటీ చైర్మన్ ధనియాకుల హనుమంతరావు ఉన్నారు.

వృక్షాలు పర్యావరణానికి జీవం పోస్తాయి..



పండ్ల మొక్కలు అందజేస్తున్న డీపీఓ చంద్రమౌళి

పాల్వంచరూరల్: వృక్షాలు నాటి సంరక్షిస్తే అవి పర్యావరణానికి జీవం పోస్తాయని జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి అన్నారు. నాగారం కాలనీలో డీపీఓ, ఎంపీడీఓలు కలిసి గురువారం రైతులకు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం రంగాపురం గ్రామపంచాయతీ కార్యాలయం సముదాయంలో మొక్కలు నాటారు. మాట్లాడుతూ మొక్కే కదా అని నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ కామన్ ల్యాండ్ ప్లాంటేషన్ ద్వారా గ్రామపంచాయతీ భూములు పచ్చదనంతో నిండిపోతాయన్నారు. నాటిన మొక్కలను సంరక్షించడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ చెన్న కేశవరావు, ఏపీఓ రంగా, టీఏ.లక్ష్మి, కార్యదర్శి మౌనిక, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులు చేపట్టండి..

టేకులపల్లి: టేకులపల్లి ప్రధాన రహదారితో పాటు గ్రామాల్లో ప్రమాదకరంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు, ఐఎఫ్‌టీయూ ఏరియా కార్యదర్శి దుబాకుల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం టేకులపల్లి సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. నేషనల్ హైవే అధికారుల నిర్లక్ష్యం వల్ల రోడ్లకు మరమ్మతు చేపట్టకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. గుగులోతు రామచంద్, ఎట్టి నరసింహారావు, బానోతు వెంకటరామ్, బోడ మంగీలాల్, బోడ మంచా, సాగర్, సతీష్ పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి



సుజాతనగర్: ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సుజాతనగర్: వర్షాకాలం సీజన్ కావడంతో గ్రామాల్లో అపరిశుభ్రత నెలకొని ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని తక్షణమే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో గురువారం సుజాతనగర్ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ... పారిశుద్ధ్య పనులు చేపట్టి మెడికల్ క్యాంపులు నిర్వహించి ప్రజలను రోగాల బారిన పడకుండా రక్షించాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 20 నెలలు అవుతున్నా నేటికీ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదలకు అందడం లేదన్నారు. అనంతరం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జాటోత్ కృష్ణ, ఏదులాపురం గోపాలరావు, రాజశేఖర్, బైరు వెంకన్న, పోలబోయిన కేశవరావు, నరసింహ పాల్గొన్నారు.

జూలూరుపాడు: గ్రామీణ ప్రాంతంలో ప్రజా సమస్యలు పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి జాటోత్ కృష్ణ, మండల కార్యదర్శి బానోత్ ధర్మా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఎంపీడీఓ తాళ్లూరి రవికి వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ వర్షాలకు గ్రామాల్లో ప్రజలు అనారోగ్యం బారినపడే ప్రమాదం ఉందన్నారు. పారిశుద్ధ్య పనులు చేపట్టడంతోపాటు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి వచ్చి 20 నెలలు అవుతున్నా ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్లు అర్హులకు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో ఎం.రాజశేఖర్, లింగాల వీరభద్రం, బైరు వెంకన్న, శరత్‌బాబు, నరసింహారావు, కేశవరావు, నరసింహా, తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసానికి కొనసాగుతున్న వరద

పాల్వంచరూరల్: ఎగువన కురుస్తున్న వర్షాలతో కిన్నెరసాని జలాశయానికి వరద కొనసాగుతోంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి వెయ్యి క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండడంతో గురువారం నీటిమట్టం 404.60 అడుగులకు చేరింది. దీంతో దిగువ ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కొత్తగూడెంటౌన్: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యర్రా కామేష్ అన్నారు. గురువారం కొత్తగూడెం పట్టణ పరిధి రామవరంలో సాధన గ్రౌండ్‌లో అంబేద్కర్ ఐటీఐ కరస్పాండెంట్ వెలన్ కుమార్ తండ్రి దొరై మెమోరియల్ రెడ్‌బాల్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలను కామేష్, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోతుకూరి ధర్మారావు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. గెలుపు ఓటములు సహజమని, ఓటమికి కుంగిపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో వెలన్‌కుమార్, దేవీప్రసన్న, మోరె రమేష్, అప్పారావు, అశోక్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు..

టేకులపల్లి: సొసైటీలో రైతులకు ఇబ్బంది లేకుండా యూరియా అందజేయాలని, ఆధార్ కార్డు, భూమి పాస్ పుస్తకం, బయోమెట్రిక్ వల్ల సమయం వృథా అవుతుందని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు సనప పొమ్మయ్య, బానోతు ఊక్లా డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో జరిగిన సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో , మండల కేంద్రాల్లో ముఖ్యంగా ఏజెన్సీ మండల కేంద్రాల్లో సహకార సొసైటీలో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొరత లేదని చెబుతున్నాయని, క్షేత్రస్థాయిలో అలా లేదని విమర్శించారు. పోలూరి శ్రీనివాస్, మదార్, బానోత్ రామ్‌సింగ్, గొగ్గెల పాపారావు, భూకా శివ, సుంకరి బుచ్చయ్య, దంతాల నారాయణ పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

టేకులపల్లి: సీపీఎస్ స్కీమ్‌ను రద్దు చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు తేజావత్ రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు శాపంగా మారిన సీపీఎస్ సెప్టెంబర్ 1న విద్రోహ దినం సందర్భంగా హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే మహాధర్నా పోస్టర్లను గురువారం సులానగర్ ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. హెచ్‌ఎం దేవదాసు, రమేష్ బాబు, రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిరపనారుపై గడ్డిమందు పిచికారీ

టేకులపల్లి: మిరపనారుపై గుర్తు తెలియని వ్యక్తులు గడ్డిమందు పిచికారీ చేయడంతో నారు చనిపోయింది. దాసుతండాకు చెందిన బానోత్ శంకర్ తన భూమిలో 15 పాకెట్ల మిరప విత్తనాలతో నారు పోశాడు. బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నారుపై గడ్డిమందు కొట్టడంతో చనిపోయింది. ఈ విషయాన్ని గురువారం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సీఎస్సార్ నిధులు కేటాయించండి..



జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న గరీబ్‌పేటవాసులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని సుజాతనగర్ పంచాయతీ గరీబ్‌పేటకు సింగరేణి సీఎస్సార్ నిధులు కేటాయించి, ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని గురువారం కొత్తగూడెం ఏరియా జీఎం జనరల్ మేనేజర్ ఎం.శాలేం రాజుకు ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్, తాగునీరు సౌకర్యం లేదని డ్రెయినేజీలు లేక వీధుల్లో దుర్గంధం వెదజల్లుతోందన్నారు. రాత్రిళ్లు చిమ్మచీకటిలో పురుగు మధ్య జీవనం గడుపాల్సి వస్తోందన్నారు. వర్షాకాలంలో ఇళ్ల మధ్యలో నీరు నిల్వ ఉండి దోమలకు నివాసంగా మారిందని, అదేవిధంగా ఈ గ్రామంలో సుమారు 300 కుటుంబాలు ఉండగా, ప్రభుత్వం ఒక అర్బన్ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయలేదన్నారు. మెడికల్ క్యాంపులు నిర్వహించాలని కోరారు. స్పందించిన జీఎం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమార్గం చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ కరీం, పాషా, కసనబోయిన లక్ష్మణ్, బీరెల్లి భద్రం, రామ్మూర్తి, ఉపేందర్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ నిర్వహణ కమిటీ ఎన్నిక

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో ప్రెస్‌క్లబ్ నిర్వహణ కమిటీ ఏర్పాటైంది. వివిధ పత్రికల స్టాఫ్ రిపోర్టర్లు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు గురువారం సమావేశమై ప్రెస్‌క్లబ్ కొనసాగించాలనే అంశంపై ఏకాభిప్రాయంతో ఏడుగురు సభ్యులతో కార్య నిర్వాహణ కమిటీని ఏర్పాటు చేశారు. గౌరవ సలహాదారుడిగా లోగాని శ్రీనివాస్, కమిటీ సభ్యులుగా ఇమ్మంది ఉదయ్‌కుమార్, పోతు రాజేందర్, బి.శంకర్, దాసరి వెంకటేశ్వరరావు, మంద రాజేష్‌కుమార్, ఎర్ర నాగేశ్వర్‌ను ఎంపిక చేశారు. ఈ సమావేశంలో వివిధ పత్రికల స్టాఫ్ రిపోర్టర్లు సతీష్, కృష్ణ గోవింద్, కాగితపు వెంకటేశ్వర్లు, అప్పడి లక్ష్మణ్, హెచ్.సత్యనారాయణ, అశోక్, అరుణ్‌కుమార్, నర్సింహారావు, రెడ్డిమల్ల నవీన్, తలారి రవికుమార్, శివకుమార్, మోటమర్రి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న శ్యామ్

సింగరేణి(కొత్తగూడెం): ప్రభుత్వ విద్యాలయాలలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా అధ్యక్షుడు బి.శ్యామ్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాలయాల్లో కనీసం ఉపాధ్యాయులు లేరని, విద్యార్థినులకు సరైన మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. అంతేకాకుండా వర్షాల కారణంగా కొన్ని హాస్టళ్లలో కరెంటు కూడా లేదని, మరికొన్ని గ్రామాలకు రాకపోకలు కరువయ్యాయన్నారు. రాష్ట్రంలో 5,431 పాఠశాలలకు విద్యుత్ సౌకర్యం లేదని, 5,124 స్కూళ్లలో టాయిలెట్లు లేవన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులకు విచ్చలవిడిగా జీతాలు పెంచుతున్న కేంద్రం విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమయిందన్నారు. తక్షణమే పాఠశాలల కనీస అవసరాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదిల్ కిరణ్, జస్వంత్, గణేష్, శశిధర్, డి.గణేష్, ముజామినీ, అజయ్, రాము, రాజు, జగదీష్, ప్రదీప్ పాల్గొన్నారు.

పాఠశాల క్రీడలను విజయవంతం చేయాలి

జూలూరుపాడు: ఈ నెల 25, 26వ తేదీల్లో నిర్వహించనున్న మండల స్థాయి పాఠశాల క్రీడలను విజయవంతం చేయాలని మండల విద్యాశాఖ అధికారి బానోత్ జుంకీలాల్ అన్నారు. గురువారం స్థానిక మండల వనరుల కేంద్రంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, పీడీ, పీఈటీలతో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ స్థానిక హైస్కూల్‌లో మండల స్థాయి పాఠశాల క్రీడా పోటీలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఈ పోటీల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. అనంతరం అన్నపురెడ్డిపల్లి కేజీబీవీ పీఈటీ లకావత్ చంద్రమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆమె మృతికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు లక్ష్మీనర్సయ్య, పి.సంజీవరావు, ఎస్కే మీరా సాహెబ్, పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.

ఘనంగా పద్మశాలీల వనసమారాధన



మాట్లాడుతున్న నరసింహారావు

జూలూరుపాడు: కాకర్ల గ్రామంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో గురువారం వనసమారాధన ఘనంగా నిర్వహించారు. పద్మశాలీ కులస్తులు గ్రామ సమీపంలోని పాలగుట్టపై శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయానికి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుట్ట వనసమారాధన నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సామూహికంగా భోజనాలు చేశారు. సంఘం నాయకులు తుమ్మ నరసింహారావు, సొబ్బని శ్రీను, పెంటి శ్రీను, తుమ్మ విజయలక్ష్మి, దాసరి నాగయ్య, గుండా సత్యనారాయణ, కొండె వెంకటేశ్వర్లు, సొబ్బని లాలయ్య, కొక్కుల సూరయ్య, సంతోష్, పోలూరి మురళీ, అప్పయ్య, కొండె శ్రీనివాస్, సాయి, పోలూరి వెంకటప్పయ్య, రాయల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి..

ఇల్లెందురూరల్: పల్లెల్లో పారిశుద్ధ్యం పనులు వేగవంతం చేయాలని కోరుతూ మాస్‌లైన్ ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ అధికారులకు అందజేశారు. నాయిని రాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఓటమి భయంతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం లేదని విమర్శించారు. పల్లెల్లో పేరుకుపోయిన చెత్తకుప్పలు, పూడిపోయిన మురుగుకాల్వల కారణంగా దోమల ఉధృతి తీవ్రస్థాయికి చేరుకుందన్నారు. ఇప్పటికే ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. బుర్ర వెంకన్న, అజ్మీర బిచ్చా, బుర్ర రాఘవులు, కోటేష్ పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

టేకులపల్లి: ఆపరేషన్ కగార్ హత్యాకాండను నిలిపివేయాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కోకన్వీనర్ మెంతిని సంజీవరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా దేవా, ఎన్డీ మండల నాయకులు కల్తీ వెంకటేశ్వర్లు, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు వీరభద్రం, ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక నాయకులు ఎట్టి ప్రశాంత్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 24న ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో హన్మకొండ అంబేడ్కర్ భవన్లో జరగనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు.

సైబర్ నేరాలపై అవగాహన

జూలూరుపాడు: స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో గురువారం జూలూరుపాడులో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. హెడ్‌కానిస్టేబుల్ దయానంద్ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుళ్లు వెంకట్, రామకృష్ణ, హోమ్‌గార్డ్ నందా, ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

టేకులపల్లి: టేకులపల్లి సెంటర్‌లో ప్రధాన రహదారి మధ్యలో ఏర్పడిన గుంత కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలువురు అదుపు తప్పి కింద పడటంతో గాయాలపాలయ్యారు. ఈ సమస్యపై సాక్షిలో పలుమార్లు వార్తా కథనాలు ప్రచురితం అయ్యాయి. ఎట్టకేలకు ఎన్‌హెచ్ అధికారులు మేల్కొన్నారు. గురువారం మరమ్మతులు చేపట్టారు. దీంతో వాహనదారులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

నీట్ ర్యాంకర్‌కు సన్మానం



బలరాంను సన్మానిస్తున్న ఎస్సై నాగుల్‌మీరా

ఇల్లెందురూరల్: పోచారంతండా గ్రామపంచాయతీ అమర్‌సింగ్ తండా గ్రామానికి చెందిన నీట్ ర్యాంకర్ జర్పుల బలరాంను కొమరారం ఎస్సై నాగుల్ మీరా గురువారం సన్మానించారు. పోలీసుస్టేషన్ ఆవరణలో ఏర్పాటైన కార్యక్రమంలో ఎస్సై మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతానికి చెందిన యువకుడు అంకితభావం, పట్టుదలతో చదవుకొని నీట్‌లో ర్యాంక్ సాధించడం అభినందనీయమన్నారు.

సమ్మె నోటీసు

ఇల్లెందురూరల్: సుదీర్ఘకాలంగా ఆశా కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 25న చలో కలెక్టరేట్, సెప్టెంబర్ 1న చలో కమిషనరేట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు గురువారం రొంపేడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కవితకు సమ్మె నోటీసు అందజేశారు. అబ్దుల్ నబీ, తాళ్లూరి కృష్ణ, మల్లీశ్వరి, లక్ష్మి, చంద్రకళ పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

జి. శ్రీనివాస్, ACM - 70754 60585 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం ఎన్. లక్ష్మయ్య - 80742 70476
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్. దుర్గారాంప్రసాద్ -9000327175 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

ఎ. నాగేశ్వరరావు - 97054 44183
ఎన్. శేషయ్య - 99121 99148
కె. మధు - 97059 44416